క్లుప్తంగా

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



శావల్యాపురం: ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ప్రచార కమిటీ అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలోని సంసిద్ పాఠశాల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన పెంపొదించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

5న హైందవ శంఖారావం బహిరంగ సభ




వినుకొండ(నూజెండ్ల) : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని ఏపీసీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో పలువురు మాట్లాడారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల గురించి సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ కొత్త రామకృష్ణ, వేదాంతం గోవిందరామానుజాచార్యులు, వీహెచ్‌పీ నాయకులు భాగవతుల రవికుమార్, గోనుగుంట్ల గంటారావు, ఇమ్మడిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనీలంపాటి అమ్మవారి తిరునాళ్ల



శావల్యాపురం : మండల కేంద్రం శావల్యాపురంలో శ్రీనీలంపాటి అమ్మవారి తిరునాళ్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని పురాతన బావి నుంచి బాలికలు మేళతాళాల నడుమ జల బిందెలను ఊరేగింపుగా తీసుకొచ్చి రాళ్ల పుట్ట వద్ద అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన రామిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు, వారి శిష్య బృందంతో ఘనంగా వేద పండితులు రావిపాటి సాయి భరత్ పూజలు నిర్వహించారు. మండలంలోని మతుకుమల్లి, గంటావారిపాలెం గ్రామాలకు చెందిన భక్త బృందం భజన, తిరుమల–తిరుపతి దాస సాహిత్య చెరుకూరి హనుమంతరావు సారథ్యంలో మహిళలు కోలాటం నిర్వహంచారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్ పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నాదెండ్ల: గణపవరం ఒకటో సచివాలయంలో ఆదివారం గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాండురంగారెడ్డి షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులను పరిశీలించారు. ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందించి ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజర్ షేక్ సుభాని మాట్లాడుతూ సోమవారం నుంచి శుక్రవారం వరకూ చిలకలూరిపేటలోని ఆర్టీవో ఆఫీసు పక్కనే తమ క్లినిక్ ఉందని, ఇందులో ప్రతి రోజూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సోమ, బుధ, శుక్రవారాల్లో కార్డియాలజీ, గురువారం న్యూరాలజీ, మంగళవారం ఎండీ జనరల్ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రాజా రమేష్ హాస్పిటల్‌తో సంయుక్తంగా ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సుమారు 30–60 నిమిషాల లోపు నడక, యోగా చేయడం వల్ల గుండె పదిలంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భౌభౌలతో బెంబేలు



కోటప్పకొండ రోడ్డులో వీధి కుక్కల గుంపు



- నరసరావుపేట పట్టణంలో వీధి కుక్కల స్వైరవిహారం
- రోజురోజుకు పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నరసరావుపేట టౌన్: వీధి కుక్కల బెడతతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. పగలు, రాత్రీ తేడాలేకుండా సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి చెందిన మున్సిపాల్టీల్లో ఒకటిగా పేరొందిన నరసరావుపేట పట్టణంలో వీధికుక్కల బెడద ఎక్కువ అయ్యింది. రోజు రోజుకు కుక్క కాటు బాధితులు ఎక్కువై పోతున్నారు. ఇటీవల రామిరెడ్డిపేటలో రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. సంఘటనలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఏ ప్రాంతంలో చూసినా శునకాలు స్వైరవిహారం చేస్తూ అటుగా వెళ్లే పాదాచారులపై దాడు చేస్తున్నాయి. దీంతో చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నా విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

గురజాడ, జాషువాలకు ఘన నివాళి



ఈపూరులో గురజాడ, జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు

ఈపూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన ఈపూరు శాఖా గ్రంథాలయంలో 4వ రోజు ఆదివారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డడ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు వారు చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

మండలంలోని ముప్పాళ్ల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గడిపూడి నరసింహారావు పాల్గొన్నారు.. విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్. నాగలక్ష్మి, గ్రామ పెద్దలు సూరె వెంకట నరసయ్య, నర్రా శ్రీనివాసరావు, పూట్ల పాపారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వెల్లటూరులో పుస్తక పంపిణీ ప్రచారం

బొల్లాపల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరులో ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంతో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్తిక మాసం విశిష్టత గురించి వివరించారు. ఈ మాసంలో కార్తిక పౌర్ణమి రోజున దేవాలయాల్లోని ధ్వజ స్తంభం పైన దీపం వెలిగించడం వల్ల భగవంతుని అనుగ్రహం లభిస్తుందని కమిటీ సభ్యులు కె.సైదారావు తెలిపారు. కార్తిక మాసం డిసెంబరు ఒకటి వరకు ఉంటుందని, భక్తిశ్రద్ధలతో దీపారాధన చేయాలని తెలిపారు. గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ పుస్తక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్. అనురాధ, ఎస్. వెంకటలక్ష్మి, డి. శ్రీను, ఎం. వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డి కార్తిక వనసమారాధన



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు



వనసమారాధనకు హాజరైన రెడ్డి వర్గీయులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని రెడ్ల సంఘం కార్యాలయంలో శ్రీ యోగి వేమా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోటప్పకొండ రెడ్ల సంఘం ప్రెసిడెంట్ వీరారెడ్డి, సెక్రటరీ పాలిమేర వెంకటరెడ్డి, ట్రెజరర్ మాగులూరి సుబ్బారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, మారెళ్ల కొండారెడ్డి పాల్గొన్నారు. కార్యాలయానికి గేటు శంకుస్థాపనతో పాటు ట్రస్టుకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు రూ.2.50లక్షలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాదాపు రూ.13లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఆరె శివారెడ్డి, సెక్రటరీ పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ట్రెజరర్ రామిరెడ్డి, గంధం బాలిరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, సోము వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి చెన్నకేశవరెడ్డి, మాలపాటి భాస్కర్‌రెడ్డి, పీవీ రమణారెడ్డి, మూలె వెంకటేశ్వరరెడ్డి, అనుమోల నాసరరెడ్డి, మేడం జయరామిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, బొట్టు వెంకటరెడ్డి, కూరపాటి అప్పిరెడ్డి, కరిపిరెడ్డి జయకృష్ణారెడ్డి, మునగాల లక్ష్మిరెడ్డి, బెజ్జం వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ ఇన్నారెడ్డి, జనపాల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ ఈదర ముసలారెడ్డి, డాక్టర్ కిషోర్ రెడ్డి, డాక్టర్ కేసరి వెంకటేశ్వరరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, కొత్త సుందరరెడ్డి, తుపాకుల కొండల రెడ్డి, కొణతం ఎరుకుల రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే జీవితంలో రాణింపు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



విద్యార్థినులకు స్వెట్టర్లు, వాటర్ బ్యాటిల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా ఎంచుకున్న రంగాల్లో రాణించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని పెదతురకపాలెం గ్రామంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకల పాఠశాలలో ఆదివారం విద్యార్థినులకు స్వెట్టర్లు, వాటర్ బ్యాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డ్–24కు ఎంపికైన పాఠశాలకు చెందిన హిందీ టీచర్ పి.జ్యోతిర్మయిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ప్రిన్సిపల్ కె.వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి నేల వాలిన వరి పైరు



రొంపిచర్ల: మండలంలో ప్రస్తుత తరుణంలో నెలకొన్న వాతావరణం వరి రైతాంగానికి ఇబ్బందిగా మారింది. శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి పైరు అక్కడక్కడా నేలవాలింది. ముఖ్యంగా విప్పర్ల, వి.రెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో సాగు చేసిన వరిపైరులో ఈ పరిస్థితి నెలకొంది. బిర్రు పొట్టపై ఉన్న నేలవారిన పైరు దెబ్బతినకుండా నాలుగు, ఐదు మొక్కలను ఒకటిగా చేసి కట్టలు కడుతున్నారు. ఇలా చేయటం వల్ల వరి పైరు నిలబడి కంకులు వస్తాయని మాగాణి రైతుల నమ్మకం.

దేశ భాషలందు తెలుగు లెస్స



ఉప్పలపాడు గ్రంథాలయంలో వేడుకలు



నరసరావుపేట గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో పాల్గొన్న సాహితీవేత్తలు

బొల్లాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 4వ రోజు ఆదివారం తెలుగు భాష ప్రాముఖ్యత గురించి సదస్సు నిర్వహించారు. దేశ భాషల్లో తెలుగు భాషకు అత్యంత ప్రాధాన్యత ఉందని గ్రంథాలయ అధికారి రమావత్ సేవాలాల్ నాయక్ తెలిపారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హఫీజున్నీసా, కృష్ణకుమారి, మైఖేల్ పాల్గొన్నారు.

ఉప్పలపాడు గ్రంథాలయంలో వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడులో శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం తెలుగు ఉపాధ్యాయులతో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు కవితలు గురించి తెలియజేశారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పెద్ద పోతురాజు, పాశం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

తెలుగు భాషా వికాసానికి కృషిచేయాలి

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషా వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు సాహితీవేత్తలు తెలిపారు. శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. మాతృభాష అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. తెలుగు భాషా వైభవాన్ని పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, త్రిభాష పండితులు డాక్టర్ కాసులనాటి నాగరాజ శర్మ, ప్రవచన కర్త పి.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, కేఆర్ కళాశాల సంస్కృత అధ్యాపకుడు జొన్నభట్ల లక్ష్మీనారాయణ వివరించారు. 6, 7తరగతుల విద్యార్థులకు సోమవారం పద్య పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ తెలిపారు.

ప్రతిభతోనే జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహణ

యడ్లపాడు: ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికితీసినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని నూతలపాటి కాళిదాసు చెప్పారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ సాహిత్యకారులు, కళాకారుల గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్, విశ్వనాథ సత్యనారాయణ, గురుజాడ అప్పారావు, మహాకవి శ్రీశ్రీ, వివిధ రంగాల్లోని ప్రముఖ కళాకారులను గురించి వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ముత్తవరపు సాంబయ్య, ఎం. మల్లికార్జునరావు, జి. శివరామకృష్ణ, యామర్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సంతగుడిపాడు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు పలు పోటీలు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖ గ్రంథాలయాల ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ఉపాధ్యాయులు ఎస్. సంపూర్ణ లక్ష్మి, ఎస్. భాను, వి. విజయలక్ష్మి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు కె. వెంకట్రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు మహిళలకు క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరం

చిలకలూరిపేట: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ నెల 19న ఉచిత గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజిని, నార్నే జయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్త్రీలకు గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ పరీక్ష, ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమావేశం



కళాశాల యాజమాన్యాన్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాలతో తమ అనుభవాన్ని పలువురు పంచుకున్నారు. కళాశాల అభివృద్ధిలో, న్యాక్ గ్రేడ్ సాధించడంలో పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయమని యాజమాన్యం పేర్కొంది. అనంతరం కళాశాల యాజమాన్యాన్ని పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డి. శివఫణీంద్ర, అధ్యపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గాంధీ పార్కు ఎదుట 108 ఉద్యోగుల ధర్నా



జిల్లా మేనేజర్ సుబ్బారావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

నరసరావుపేట టౌన్: డిమాండ్‌ల సాధన కోసం సోమవారం స్టేషన్ రోడ్డు గాంధీ పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు 108 ఉద్యోగులు తెలిపారు. సమస్యలు పరిష్కారం కోరుతూ 108 జిల్లా మేనేజర్ సుబ్బారావును కలిసి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, ఉమా శంకర్ మాట్లాడుతూ సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేసే ఉద్యోగాలలో 108లో పని చేస్తున్న సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. అప్పటి వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటామని తెలిపారు.

బైక్ దొంగలు అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన పలువురు యువకులను ఐనవోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. 10 వాహనాలను స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్



చిలకలూరిపేటలో అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అజాద్ నగర్ కాలనీలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు స్వయంగా అర్జీలు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలల గడుస్తున్నా ఇళ్ల స్థలాల ఊసే ఎత్తలేదని విమర్శించారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వెంకేటశ్వర్లు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు పంపిణీ చేసే వరకు పోరాటం

చిలకలూరిపేట: పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాడతామని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు చెప్పారు. పట్టణంలోని జాగుపాలెంలో ఇళ్లు లేని నిరుపేదల నుంచి స్థలాల కోసం అర్జీలు ఆదివారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం కోసం రూ. ఐదు లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల నుంచి సేకరించిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయాలి

రొంపిచర్ల : అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ నరసరావుపేట నియోజకవర్గ కార్యదర్శి సీహెచ్. సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. మండలంలో మాచవరంలో ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు స్థలాలు పంపిణీ చేయాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యనారాయణరాజు మాట్లాడుతూ స్థలాల పంపిణీతో పాటు ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, నాయకులు సీహెచ్. శ్రీనివాసరెడ్డి, కె.అంజిరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, వై.వెంకటరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.